క్లుప్తంగా

నేడు విద్యానగర్‌లో వైఎస్సార్‌సీపీ సమావేశం

కోట/చిట్టమూరు: విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొంటారని తెలిపారు. జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమ నిర్వహణపై చర్చిస్తామన్నారు.

పరమేశ్వరిదేవికి పొంగళ్లు

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడులో వున్న ముంగమూరి పరమేశ్వరిదేవి అమ్మవారి జాతరలో మూడో రోజు ఆదివారం గ్రామస్తులు గ్రామ పొంగళ్లు పెట్టారు. మహిళలు మేళ తాళాల మధ్య ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ఆదిశక్తిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని నెలవల సుబ్రమణ్యం, ఉయ్యాల ప్రవీణకుమార్ దర్శించుకున్నారు. కమిటీ సభ్యుడు తాడిపర్తి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

8న శ్రీవారికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి జూన్ 8న చందనాలంకరణ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రోజు స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి మూలమూర్తికి ఉదయం 4 గంటలకు అభిషేకాలు, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కండలేరులో 40.370 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 40.370 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వేణుంబాకంలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నాయుడుపేటలోని ఎస్ఎస్‌వీ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవల్లిప్రియాంకరెడ్డి షుగర్, జనరల్ వ్యాధులకు సంబంధించి రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

అమ్మవారికి సేవ చేస్తూ అనంత లోకాలకు..



అమ్మవారికి గుమ్మడికాయతో దిష్టితీస్తున్న శోభన్‌బాబు (ఫైల్)

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని బెస్తపాళెంలో రెండు రోజుల నుంచి కావమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. అదే ప్రాంతానికి చెందిన శోభన్‌బాబు అమ్మవారికి గుమ్మడికాయతో దిష్టితీస్తుండగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన భక్తులు అతన్ని వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వెంకటగిరి రూరల్ : తనను కులం పేరుతో దూషించినట్లు వెంకటగిరి మండలం వర్ధనపల్లికి చెందిన నూకల చెంచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదివారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. చెంచయ్యకు, అక్కంపేటకు చెందిన కొందరితో భూ వివాదం ఉంది. ఈ క్రమంలో అక్కంపేటకు చెందిన వారు కులం పేరుతో దూషించినట్లు చెంచయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

బియ్యం బస్తాల పంపిణీ



నాయుడుపేట టౌన్ : ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని, విశ్రాంత ఉపాధ్యాయుడు సి.చంద్రమౌళి పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న చేయూత చిన్న పిల్లల ఆశ్రమానికి ఆదివారం నాలుగు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు తొప్పని కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ మొదలైన రేషన్ కష్టాలు

మాది మంచి ప్రభుత్వం. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేశాం అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దు చేశారు. పేదలు మళ్లీ చౌకదుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునే దుస్థితిని కల్పించారు. మొదటి రోజు నుంచే పేదలకు కష్టాలు మొదలయ్యాయి. సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాసి బియ్యం తెచ్చుకోవాల్సి వచ్చింది.

– సూళ్లూరుపేట/దొరవారిసత్రం/నాయుడుపేట టౌన్/సైదాపురం/ఓజిలి/కోట/చిట్టమూరు/చిల్లకూరు /వెంకటగిరి రూరల్ /తడ/కలువాయి(సైదాపురం)వాకాడు:

- పలుచోట్ల మొరాయించిన ఈపాస్ మెషిన్లు
- పది శాతం మందికి కూడా అందని సరుకులు
- సరుకుల కోసం గంటల తరబడి పడిగాపులు



నాయుడుపేట పట్టణం అగ్రహారపేటలో రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

దొరవారిసత్రం మండలంలో 41 రేషన్ షాపులకు గాను 11,680 మంది కార్డుదారులు ఉన్నారు. షాపుల వద్దే సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మొదటి రోజు ఆదివారం సర్వర్లు పనిచేయకపోవడంతో కార్డుదారులకు తిప్పలు తప్పలేదు. స్థానిక తహసీల్దార్ శైలకుమారి వేణుంబాకం, డీవీ సత్రం, నెలబల్లి తదితర షాపుల వద్ద సరుకుల పంపిణీని పరిశీలించారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వివిధ సమస్యలతో మంచం మీద ఉన్నవారు 1,303 మంది ఉన్నారని, వారికి ప్రతినెలా 5వ తేదీలోపు ఇంటి వద్దే సరుకులు అందజేస్తామన్నారు.

- నాయుడుపేట మండలంలో 47 రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ ప్రారంభమైంది. నాయుడుపేట మున్సిపాలిటీలోని రేషన్ షాపుల్లో ఈ పాస్ మెషిన్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. డబ్బాల్లో తూకం వేస్తుండడంతో 20 కేజీలకు 2 నుంచి 3 కేజీల బియ్యం తక్కువగా ఇస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు.
- సైదాపురం మండలంలోని 38 రేషన్ షాపులు ఉన్నాయి. ఆదివారం ఉదయమే రేషన్ సరుకుల కోసం ప్రజలు షాపుల వద్దకు పరుగులు తీశారు. సర్వర్ పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు బియ్యం పంపిణీ మొదలుకాలేదు.
- ఓజిలి మండలంలోని కురుగొండ, ఓజిలి, రాచపాళెం గ్రామాల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ పద్మావతి ఆదివారం పరిశీలించారు. మండలంలో 32 రేషన్ షాపుల్లో 10,522 మంది లబ్ధిదారులకు 31,547 యూనిట్ల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. చౌక దుకాణాల్లో డీలర్లు సమయపాలన పాటించి సరుకులు అందించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలుచోట్ల సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. సరుకులు తీసుకున్న గ్రామీణులు నెత్తిన పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది.
- కోట మండలంలో 26 రేషన్ దుకాణాలు, 16,143 కార్డులు ఉన్నాయి. కార్డుదారులు ఆదివారం ఉదయాన్నే రేషన్‌షాపుల వద్దకు చేరుకున్నారు. కొన్ని చోట్ల టీడీపీ నాయకులు ప్రారంభం పేరుతో హడావుడి చేశారు. కోట క్రాస్ రోడ్డు రేషన్ దుకాణం వద్ద నాయకుల రాక ఆలస్యం కావడంతో 9 గంటల వరకు జనం నిరీక్షించాల్సి వచ్చింది. లక్ష్మక్కకండ్రిగ, కేసవరం, మద్దాలిలో సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు సరుకులు మోసుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడడం కనిపించింది.
- చిట్టమూరు మండలంలో 23 పంచాయతీలకు 33 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో ఆరూరు రేషన్ షాపును టీడీపీ ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపించలేదని తెలిపి డీలర్ తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఉప్పలమర్తి పంచాయతీ ఎం.జంగాలపల్లిలో ఉదయం 11 గంటల వరకు రేషన్ షాపు తాళాలు తీయలేదు. ఈ విషయంపై సీఎస్‌డీటీని వివరణ ఇస్తూ అన్ని షాపులకు సరుకులు కేటాయించామని, డీలర్లు తీసుకు వెళ్లలేదన్నారు. సర్వర్ సమస్యతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు.
- చిల్లకూరు మండలంలో సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరగంటకు ఒకరి వేలి ముద్రలు పడడంతో రోజంతా 15 మందికి కూడా బియ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. చిల్లకూరులో తహసీల్దార్ శ్రీనివాసులు రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. అక్కడ లబ్ధిదారుల కంటే నాయకులే ఎక్కువ మంది కనిపించడం విశేషం.
- తడ మండలంలో 38 రేషన్ షాపులకు గాను 14,440 కార్డులు ఉన్నాయి. తొలి రోజు సర్వర్ పనిచేయకపోవడంతో 10 శాతం మందికి కూడా బియ్యం పంపిణీ చేయలేదు. ఇరకం, వేనాడు, రామాపురం, పెరియవట్టు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- వెంకటగిరి పట్టణంలోని ఉపాధ్యాయనగర్, జంగాలపల్లిలోని రేషన్ షాపులను తహసీల్దార్ రాంబాబు ప్రారంభించారు. సర్వర్ సమస్యతో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వరకు కార్డుదారులకు తిప్పలు తప్పలేదు. బీసీకాలనీ, ఉపాధ్యాయనగర్, తోలిమిట్ట, సాలికాలనీతోపాటు పలు ప్రాంతాల్లో షాపులను మూసివేశారు. వల్లివేడు క్రాస్ రోడ్డు, పరశురాం కాలనీ, ఏఎంసీ గోడౌన్ వెనుక వైపు ఉన్న ప్రజలు 5 కిలోమీటర్ల దూరంలోని మనులాలాపేటకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చింది. జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్లు, 25వ వార్డులోని వారు ఐదు కిలోమీటర్ల దూరంలోని రేషన్‌షాపుల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చింది.
- వాకాడు మండలంలో 30 రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీని అధికారులు, నాయకులు ప్రారంభించారు. 14 చోట్ల ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు మండుటెండలో ఇబ్బంది పడ్డారు. రోజుకు రూ.700ల కూలి వదులుకుని సరుకుల కోసం వేచి చూడాల్సి వస్తోందని ప్రజలు వాపోయారు. సరుకులు తీసుకున్న వారు నెత్తిన బరువుతో 3 కిలోమీటర్లు కాలి నడకన మోసుకుపోవాల్సి వచ్చింది. మండలంలో 12,284 రేషన్ కార్డులు ఉండగా తొలి రోజు 2,145 కార్డులకు సరుకులు అందించినట్లు తెలిసింది.



వాకాడు: బియ్యం మోసుకెళ్తున్న లబ్ధిదారులు



దొరవారిసత్రం : వేణుంబాకంలోని రేషన్ షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు





సైదాపురం : సర్వర్ పనిచేయకపోవడంతో ఊటుకూరు, సైదాపురంలో వేచి వున్న కార్డుదారులు



కోట : లక్ష్మక్కకండ్రిగలో సర్వర్ పనిచేయక నిరీక్షిస్తున్న జనం



దొరవారిసత్రం: నెలబల్లిలో వృద్ధుడికి బియ్యం అందజేస్తున్న తహసీల్దార్ శైలకుమారి



వెంకటగిరి : బియ్యం మోసుకుని వెళుతున్న రాజేశ్వరి



చిట్టమూరు: అట్టహాసంగా ప్రారంభించి మూసి వేసిన రేషన్ షాపు



తడ : అక్కంపేట రేషన్ దుకాణం వద్ద సర్వర్ పనిచేయకపోవడంతో వేచివున్న ప్రజలు

వెన్నుపోటు వీరుడు చంద్రబాబు



పోస్టర్లను విడుదల చేస్తున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు : ఆదరించిన వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ విమర్శించారు. ఆయన ఆదివారం గూడూరు పట్టణం సనత్‌నగర్‌లోని తన నివాసంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. దీన్ని నిరసించడంతోపాటు చంద్రబాబు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంపై సోమవారం గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు మండలాలకు చెందిన నాయకులు, మంగళవారం కోట, వాకాడు చిట్టమూరు మండలాలకు చెందిన నాయకులతో విద్యానగర్‌లో సమీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, యద్దల మధుసూదన్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూడూరు ఎంపీపీ బూదరు గురవయ్య, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మెట్టా రాధాక్రిష్టారెడ్డి, కోడూరు మీరారెడ్డి, ఒడూరు బాలక్రిష్టారెడ్డి, పాదర్తి రాధాక్రిష్టారెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, యల్లా శ్రీనివాసులురెడ్డి, నాగిశెట్టి శారదమ్మ, జమళ్ల సుఖన్య, సుప్రియారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ను విజయవంతం చేద్దాం

వెంకటగిరి రూరల్ : చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వెంకటగిరి మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య తెలిపారు. వారు ఆదివారం డక్కిలి మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ కళ్యాణి, నేతలు యస్దానిబాషా, పాదిలేటి దరశరథరామిరెడ్డితో కలిసి వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఆదివారం వెన్నుపోటు దినం కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఏడాది పూర్తయినా ఒక్క హామీ కూడా నెవర్చలేదన్నారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆటంబాకం శ్రీనివాసులు, గోపాలకృష్ణ, సుభావలి, సుఖన్య, నేతలు రాజారెడ్డి, సదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006లో పదో తరగతిని చదివిన వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. స్నేహితులతో కలిసి సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పెంచల నరసారెడ్డి, రాజాబాబు, మాధవరావు, నాగరాజు, సుధాకర్, గోపి, దయాకర్, చంద్రకళ, పూర్వ విద్యార్థులు షేక్ హబీబ్, నాగార్జున, చెంచు, పెంచల నరసమ్మ, కోనయ్య, సుబ్బారెడ్డి, సురేష్, పెంచలరెడ్డి పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజలను దగా చేశారు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి, కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : చంద్రబాబు నాయుడు అబద్దాలతో ప్రజలను దగా చేశారని ఎంపీ, వైఎస్సార్ సీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం నాయుడుపేటలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ ప్రభుత్వం కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. రాష్ట్రంలో ఇప్పుడున్న వైద్య కళాశాలలు, హార్బర్లు, పోర్టులు తదితరాలు జగన్ హయాంలో వచ్చినవేనన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.లక్షల కోట్లను అమరావతి పేరుతో పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వెన్నుపోటు దినం పేరుతో పోరాటాలకు సిద్ధమైనట్లు తెలిపారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ, నాయకులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, కటకం జయరామయ్య, కట్టా భవాని శంకర్‌రెడ్డి, గంధవళ్లి సిద్ధయ్య, చదలవాడ కుమార్, మునుస్వామి నాయుడు, జెట్టి వేణు యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి హాకీ శిక్షణా శిబిరం



క్రీడాకారులతో సంస్థ ప్రతినిధులు, పీడీ తదితరులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం విందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెలలో ప్రారంభమైన వేసవి హాకీ శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పీడీ కరీముల్లా ఖాన్ మాట్లాడుతూ గూడూరు పట్టణం హాకీకి పుట్టినిల్లు లాంటిదని తెలిపారు. ఇక్కడి నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువకులు కూడా హాకీ క్రీడను నేర్చుకునేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నెల రోజుల పాటు వేసవి శిక్షణా శిబిరంను నిర్వహించినట్టు తెలిపారు. క్రీడాకారులకు గూడూరు పట్టణానికి చెందిన ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు దాతల సహకారంతో దుస్తులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్,మురళీ, మునిప్రసాద్, చిట్టే శ్రీనివాసులు, మహేశ్వరి పాల్గొన్నారు.

యోగా ప్రాముఖ్యతను గుర్తించాలి



యోగాసనాలు వేస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ, ఎస్ఐలు

నాయుడుపేట టౌన్ : యోగాతో అనేక వ్యాధులను నయం చేయొచ్చని, మనసు ప్రశాంతంగా ఉంటుందని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని సర్కిల్, పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్ఐలకు యోగా శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. యోగాపై స్థానిక ఐఈఆర్టీ సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు బాబీ, సంగమేశ్వరరావు, ఎస్ఐలు ఆదిలక్ష్మి, స్వప్న, అజయ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.